


# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

యాదాద్రిభువనగిరి | బుధవారం 30 సెప్టెంబర్ 2026




## రైతన్నను కాపాడుకోవడమే మా బాధ్యత

- రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తాం
- చిమ్మిర్యాలలో రూ.3 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపూర్ :** వ్యవసాయ రంగానికి, రైతులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం చిమ్మిర్యాల గ్రామంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గంలో సాగునీటి వనరులు తక్కువగా ఉండటంతో రైతులు అధికంగా వర్షాధార పంటలపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. రైతులకు సాగు సమయంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటి తరలింపుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుతం ఏదుల రిజర్వాయర్ నుంచి శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పుట్టపాక, నాంపల్లి మండలాల్లోనూ 132 కేవీ సబ్‌స్టేషన్లను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యుత్ సరఫరాలో లోపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఓ విశ్రాంత అధికారిని నియమించినట్లు వెల్లడించారు.



## ఆలేరును అన్ని రంగాల్లో ముందంజలో నిలుపుతాం

- కొత్తజాలలో గ్రామపంచాయతీ భవనం ప్రారంభించిన విప్ బీర్ల ఐలయ్య
- పాముకుంటలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, రేషన్ కార్డుల పంపిణీ
- పీఏసీఎస్ మహాజన సభలో పాల్గొన్న ఆలేరు ఎమ్మెల్యే



**తొలివెలుగు, రాజాపేట :** ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. మంగళవారం రాజాపేట మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా సింగారంలో స్థానికులను కలుసుకుని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తజాల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడానికే పంచాయతీ భవనాలు ఎంతో తోడ్పడతాయన్నారు. పాముకుంట గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రహదారి నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడి రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. రాజాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు.



# భూ సమస్యలకు 'రీసర్వే'తో చెక్

- పేరేపల్లి, పిట్టంపల్లి గ్రామాలు ఎంపిక
- ప్రజలంతా సహకరించాలి: ఆర్డీవో అశోక్ రెడ్డి




**తొలివెలుగు, చిట్యాల :** భూముల రీసర్వే ద్వారా భూసంబంధిత సమస్యలు, సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నల్లగొండ ఆర్డీవో అశోక్ రెడ్డి తెలిపారు. చిట్యాల మండలంలోని పేరేపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో పేరేపల్లితో పాటు పిట్టంపల్లి గ్రామం కూడా ఈ రీసర్వే ప్రక్రియ కోసం ఎంపికైనట్లు వెల్లడించారు. రీసర్వేలో భాగంగా తొలుత ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, చెరువులు, కుంటలు, రహదారుల కొలతలు పూర్తి చేస్తామని.. ఆ తర్వాతే రైతుల పట్టా భూముల సర్వే చేపడతామని వివరించారు. ఈ ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు గ్రామస్తులంతా అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ రూపొంది సోనియా, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, సర్వేయర్ రజినీకాంత్, జీపీఓ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులను ఆదుకోవాలి

- సంఘం అభివృద్ధికి సభ్యులంతా కలిసికట్టుగా కృషి చేయాలి



**తొలివెలుగు, చిట్యాల :** చేనేత రంగాన్ని, చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని చిట్యాల చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గంజి సుధాకర్ కోరారు. మంగళవారం చిట్యాలలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి, అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అలాగే సంఘం ప్రగతి, అభివృద్ధికి సభ్యులందరూ ఐక్యంగా సహకరించాలని సూచించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చెరుపల్లి శ్రీనివాస్, డైరెక్టర్లు మిరియాల ప్రకాష్, వడ్డేపల్లి రాములు, మిరియాల నరేందర్, గంజి దేవకమ్మ, నాయకులు గంజి కనకయ్య, తడక మురళీధర్, గుజ్జరి యాదగిరి, నేరడ సంఘం అధ్యక్షుడు కందగట్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన బాల్యం

- మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు
- పోషణ మాసం వేడుకల్లో అన్నప్రాసన కార్యక్రమం

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన బాల్యం సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ పోషణ మాసం వేడుకల్లో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అన్నప్రాసన జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే దృఢమైన ఆరోగ్యం సొంతమవుతుందని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజం వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తల్లులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, ఎంపీడీవో విజయ, కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, మండల వైద్యాధికారి శ్రీవాణి, సీడీపీవోలు/సూపర్వైజర్లు పద్మ, శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు శోభ, వసంత, ఆరోగ్య కార్యకర్తలు జానకి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





# ఆలేరును అన్ని రంగాల్లో ముందంజలో నిలుపుతాం

పిఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన పీఏసీఎస్ మహాజన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా సహకార సంఘాలు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన బేగంపేటకు చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ చిగుళ్ల చంద్రపాల్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోలి రవికుమార్, ఎంపీడీవో కూతల నాగవేణి, ఏడీఏ పద్మజ, ఆత్మ డివిజన్ చైర్మన్ గనగండ్ల సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాలరాజు గౌడ్, విఠల్ నాయక్, ఎం.బి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, రంగా నరేష్ గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, పిఏసిఎస్ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.



# మండిపడ్డ కమలనాథులు

- పోచంపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- దేవుళ్లపై వ్యాఖ్యల పట్ల భాజపా ఆగ్రహం

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** దేవుళ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల, పట్టణ భాజపా శాఖల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక నేతాజీ చౌరస్తా వద్దకు చేరుకున్న భాజపా శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు దబ్బికార్ సాహెబ్, మేకల రవీందర్ రెడ్డి ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీని విమర్శించే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి శ్రీరాముడు, శివుడిపై వ్యాఖ్యలు చేస్తూ దేవుళ్ల పేరిట రాజకీయాలు చేయడం తగదన్నారు. అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుని, వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాజపా అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, జిల్లా చేనేత సెల్ కన్వీనర్ గంజి బసవలింగం, నాయకులు రచ్చ సత్యనారాయణ, పల్లెకాడి బసవయ్య, మేకల చొక్కారెడ్డి, సురివి శ్రీనివాస్, ముద్దం హరీష్ యాదవ్, రామిడి యాదిరెడ్డి, ఉప్పునూతల నరసింహా, మేకల చంద్రవాస్ యాదవ్, ఎడమెని అంజయ్య, అంబదాస్, చెరుకు రాములు పాల్గొన్నారు.

# మోదీ పాలనలోనే దేశాభివృద్ధి

- బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గంజి గోవర్ధన్
- చిట్యాలలో వృద్ధులకు పండ్ల పంపిణీ

**తొలివెలుగు, చిట్యాల :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గంజి గోవర్ధన్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా వారోత్సవాల్లో' భాగంగా చిట్యాలలో మంగళవారం వృద్ధులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రధాని మోదీకి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. గడిచిన పుష్కరకాలంలో భారతదేశం ఆర్థికంగా, సాంకేతికంగా సరికొత్త శిఖరాలకు చేరుకుందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోనూ బీజేపీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్, నాయకులు జయారపు రామకృష్ణ, పల్లె వెంకన్న గౌడ్, శిఖిలం మెట్ల అశోక్, గోశిక వెంకటేశం, ముక్కామల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.





# సరికొత్త ఆలోచనలతోనే వ్యాపార పురోగతి

- వ్యాపార అభివృద్ధికి నూతన వ్యూహాలు, సమర్థవంతమైన ప్రణాళికలు అవసరం

**తొలివెలుగు, నాగోల్:** వ్యాపార రంగంలో విజయాన్ని సాధించాలంటే సరికొత్త ఆలోచనలు, సమర్థవంతమైన ప్రణాళికలు, నూతన వ్యూహాలతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం ఎంతో కీలకమని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, లైఫ్ స్కిల్స్ కోచ్ వేణుగోపాల్ లక్ష్మీపురం అన్నారు. నాగోల్-బండ్లగూడ మార్గంలోని పీబీఆర్ కన్వెన్షన్‌లో సిరి మహాలక్ష్మి ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో బిజినెస్ మీటింగ్ నిర్వహించారు. సంస్థ ఫౌండర్, ఎండీ కళ్ళం వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వేణుగోపాల్ లక్ష్మీపురం ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. సేల్స్ సైకాలజీ, బిజినెస్ బిల్డింగ్ టిప్స్, లక్ష్యాల నిర్దేశం, కస్టమర్ల అవసరాలను అర్థం చేసుకోవడం, వ్యాపార విస్తరణకు అనుసరించాల్సిన విధానాలపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ కళ్ళం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధితో పాటు ప్రతి సభ్యుడి వ్యక్తిగత, వృత్తిపరమైన ఎదుగుదలకు అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. నిబద్ధతతో పనిచేసే వారికి సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సంస్థ అభివృద్ధికి కృషి చేసిన అచీవర్స్‌ను ఘనంగా సన్మానించారు. టాటా ఏఐజీ ద్వారా రూ.10 లక్షల సమ్‌అష్యూర్డ్ బీమా సర్టిఫికెట్లను విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అడ్మిన్ అండ్ సీఈఓ హనీమీ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అసోసియేట్లు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

- రాజాపేటలో భగ్గుమన్న బీజేపీ శ్రేణులు
- గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన
- వ్యాఖ్యలను ఖండించిన పార్టీ మండల అధ్యక్షుడు మేకల రమేష్

**తొలివెలుగు, రాజాపేట :** హిందూ దేవుళ్లను, హిందువులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించారని ఆరోపిస్తూ రాజాపేట మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మేకల రమేష్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం తగదని హితవు పలికారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు పాటించాలి
- బోగారంలో పోషకాహార అవగాహన సదస్సు
- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత

**తొలివెలుగు, రామన్నపేట :** సమతుల్యమైన పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. పోషణ మాసం సందర్భంగా రామన్నపేట మండలం బోగారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ రోజువారీ ఆహారంలో పాలు, గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలను భాగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కడుపులోని శిశువు ఆరోగ్యకరంగా ఎదుగుతుందని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి పోషకాహారం ఎంతో అవసరమని, తల్లిదండ్రులు పిల్లల తిండిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఏ. సుధా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, అంగన్‌వాడీ టీచర్ బత్తుల వసంత, ఆశా వర్కర్లు జెల్ల సంధ్య, జెల్ల పారిజాత, అంగన్‌వాడీ ఆయమ్మలు రత్నం, ఎల్లమ్మ, పంజాల ధనమ్మ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



# ‘ఈసీ’పై ఆధారాల్లేని ఆరోపణలు తగవు

- ఓటమి భయంతోనే కాంగ్రెస్ ‘ఓట్ చోరీ’ నాటకాలు
- బీజేపీ నేత నకిరకంటి మొగులయ్య ఆగ్రహం

**తొలివెలుగు, రామన్నపేట :** ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ పార్టీ నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని నకిరేకల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నకరికంటి మొగులయ్య విమర్శించారు. రామన్నపేటలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసీ స్వతంత్ర వ్యవస్థ అని, ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా నిబంధనల ప్రకారమే ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణలు, ఫారం-6 ద్వారా కొత్త పేర్ల నమోదు అనేది నిరంతరం జరిగే ప్రక్రియలో భాగమేనని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ ‘ఓట్ చోరీ’ పేరుతో గందరగోళం సృష్టిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఇలాంటి బాధ్యతారాహిత్య రాజకీయాలు మానుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య, మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ, వార్డు మెంబర్ సుర్వి హరిబాబు, ఉపాధ్యక్షులు బట్టే రమేష్, నకిరేకంటి రవి, గురుకు సైదులు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీల సేవలు వెలకట్టలేనివి

- ‘సేవా సంకల్ప అభియాన్’లో టీచర్లకు సత్కారం
- పోషకాహారంతోనే సమగ్ర ఆరోగ్యం: బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్ రెడ్డి

**తొలివెలుగు, రామన్నపేట :** సమాజ ఆరోగ్య పరిరక్షణతో పాటు ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణంలో అంగన్‌వాడీ సిబ్బంది పాత్ర అభినందనీయమని బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరిపాలనకు గుర్తుగా నిర్వహిస్తున్న ‘సేవా సంకల్ప అభియాన్’ కార్యక్రమంలో భాగంగా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కట్ట యాదయ్య ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఏలూరి అనిత, యాదాసు శోభ, గాదె మంజులలను శాలువాలతో సత్కరించారు. ?ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బండ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. నేటి తరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో వారు కీలక భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య, సీనియర్ నాయకులు మన్నెం పద్మారెడ్డి, గోపగోని ధర్మరాజు, మండల ఉపాధ్యక్షుడు బట్టే రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# చేనేత సహకార సంఘాలకు పూర్వవైభవం

- సహకార వ్యవస్థల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం: ఏడీ శ్రీనివాస్
- గతంలో సంఘాలను నిర్వీర్యం చేశారు: మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి** : చేనేత సహకార సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో పనిచేస్తోందని జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు (ఏడీ) శ్రీనివాస్ తెలిపారు. పురపాలక పరిధిలోని రేవనపల్లి చేనేత సహకార సంఘం మహాసభ కార్యక్రమం మంగళవారం సంఘ అధ్యక్షుడు కొంగరి జంగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి పురపాలక చైర్మన్ తడక వెంకటేశ్వర్లుతో కలిసి ఏడీ ముఖ్య అతిథిగా హాజరై మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికలు నిర్వహించకుండా సహకార సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, వాటి అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేనేత కార్మికుల అభివృద్ధి, పోచంపల్లి పర్యాటక రంగ విస్తరణే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. పర్యాటకుల రాక పెరిగితే చేనేత చీరలకు గిరాకీ పెరిగి కార్మికులకు ఉపాధి మెరుగవుతుందన్నారు. చేనేత కళాకారులు వినూత్న డిజైన్లతో అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ ఏర్పరచుకోవాలని కోరారు. ఈ




కార్యక్రమంలో చేనేత సహకార సంఘాల నాయకులు భారత లవ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, కౌన్సిలర్ రావుల జంగయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, నోముల రఘు, మాజీ కౌన్సిలర్ గుండు మధు, సంఘ గౌరవాధ్యక్షుడు సురేపల్లి యాదగిరి, ఉపాధ్యక్షుడు వనం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొంగరి వెంకటేష్, కోశాధికారి చిలువేరు గురుస్వామి, డైరెక్టర్లు గుండు కృష్ణ, రవ్వ లక్ష్మయ్య, గంజి సుదర్శన్, సురేపల్లి లక్ష్మమ్మ, దుద్యాల జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఆర్థిక ఇబ్బందులున్నా పథకాల అమలులో వెనుకడుగు లేదు
- త్వరలోనే కొత్త పెన్షన్ల మంజూరు: మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్

**తొలివెలుగు, చిట్యాల:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చిట్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్ తెలిపారు. చిట్యాల పురపాలక పరిధిలో మంగళవారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నూతనంగా అర్హత పొందిన లబ్ధిదారులకు త్వరలోనే కొత్త పెన్షన్లు మంజూరు చేసి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ గాలి యాదమ్మ లింగయ్య, స్థానిక నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

- బీఎల్ఓల పనితీరును పర్యవేక్షించిన బీజేపీ నాయకులు
- జీఎస్ఐ డివిజన్ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల సందర్శన

**తొలివెలుగు, ఎల్బీనగర్ :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ జీఎస్ఐ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర వినోద్ రెడ్డి సూచించారు. ఎస్ఐఆర్ ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గం, జీఎస్ఐ డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లను మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన సందర్శించి, బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్ఓ) పనితీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బూత్ సంఖ్యలు 65, 70 నుంచి 80, 106, 107, 108, 113, 114ల పరిధిలో బీఎల్ఓల వద్ద ఉన్న ఎస్ఐఆర్ నోటీసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హులైన ఓటర్ల ఇళ్లకు నేరుగా వెళ్లి నోటీసులు అందజేయాలని, నోటీసుల ఉద్దేశాన్ని వివరించి అవసరమైన వివరాలు, ధ్రువీకరణ పత్రాలను సేకరించాలని సూచించారు. ప్రజలు కూడా ఓటరు జాబితాలో తమ పేర్లను పరిశీలించుకుని, బీఎల్ఓలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జీఎస్ఐ డివిజన్



కార్యదర్శి గోపాల్ శర్మ, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ సంజీవరెడ్డి, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అనాథగా పడి ఉన్న మృతదేహం

- వనస్థలిపురంలో రోడ్డు పక్కన వ్యక్తి మృతి
- మృతుడి ఎడమ చేతిపై 'మీనాక్షి' పచ్చబొట్టు
- ఉస్మానియా మార్చురీకి తరలింపు



**తొలివెలుగు, వనస్థలిపురం** : వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి (45–50) మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. హాకీంపేట్ కమాన్ సమీపంలోని ప్రణవి గార్డెన్ యూటర్న్ వద్ద ఉన్న యమహా బైక్ షోరూం ముందు మంగళవారం సాయంత్రం 3.20 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి మృతి చెంది పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఎడమచేతిపై 'మీనాక్షి' అని పచ్చబొట్టు ఉంది. మాసిన నలుపు రంగు ప్యాంట్, లేత నీలం రంగు చొక్కా ధరించి ఉన్నాడు. కొద్దిగా బట్టతలతో, 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ వర్ణం కలిగి ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు లేదా ఆచూకీ తెలిసిన వారు 8712662300, 8712662637, 8712662280 ఫోన్ నంబర్లలో వనస్థలిపురం పోలీసులను సంప్రదించాలని కోరారు.

# ఆకేరు వాగులో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి

- పెదనాన్న కర్మకాండకు వచ్చి ప్రమాదవశాత్తు నీట మునిగిన వైనం
- చిన్నగూడూరు గ్రామంలో విషాదం

**తొలివెలుగు, చిన్నగూడూరు** : స్నానం చేసేందుకు ఆకేరు వాగులోకి దిగి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్నగూడూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై కుశ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... చిన్నగూడూరు గ్రామానికి చెందిన మానుపాటి ముత్తయ్య (43) తన పెదనాన్న (దివంగత మానుపాటి భిక్షం) మూడొద్దుల కార్యక్రమానికి హాజరయ్యాడు. కర్మకాండల్లో భాగంగా స్నానం చేసేందుకు సమీపంలోని ఆకేరు వాగుకు వెళ్లాడు. అక్కడ స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి వాగులోని లోతైన ప్రాంతంలో పడి మునిగిపోయాడు. గమనించిన వారు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. తండ్రి మృతదేహానికి పంచనామా నిర్వహించి, తదుపరి కార్యక్రమాల నిమిత్తం తమకు అప్పగించాలని మృతుడి కుమారుడు మానుపాటి జగదీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు హెచ్‌సీ కైలాసం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

